క్లుప్తంగా

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తక్షణమే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కో ఆర్డినేటర్ బండి జకరయ్య పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, దేశ ద్రోహం కేసు నమోదు చేసి భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై నమోదు చేసిన కేసును ఉపసంహరించుకోవాలన్నారు. సోమవారం బాబాసాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించి, కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెం విజయ్ భాస్కర్, సిరాజుద్దీన్, గౌస్‌పీర్, తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడిగా ఇమ్మానుయేల్


ఇమ్మానుయేల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవధి సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ ఎంపిక జరిగిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడిగా నాగదాసరి ఇమ్మానుయేల్, కార్యదర్శిగా కానగల మునెయ్య. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పడిగే వెంకటరమణ, సహాయ కార్యదర్శులుగా పాలంపల్లి చంద్రగుప్త నాగేశ్వరరావు, మాకి పోగు ప్రసాద్, యేసు రత్నం, గోవిందు, ఉపాధ్యక్షుడిగా పెంచలయ్యతోపాటు పలువురిని ఎన్నుకున్నామన్నారు.

షాపింగ్‌మాల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయిస్తూ ప్రజా రవాణాకు అసౌకర్యం కలిగిస్తున్న షాపింగ్ మాల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి పండగల సీజన్ కావడంతో నగరంలోని వస్త్ర దుకాణాలు, షాపింగ్ మాల్స్, జ్యువలరీ షాపింగ్‌ల వద్ద రద్దీ ఎక్కువగా వుంటోందన్నారు. కస్టమర్స్‌కు పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేయకండా ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. సమావేశంలో ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సందడి


శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్: కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. కమలాపురం కిశోర్ ఆర్కే డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి మునిరాజు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి మృతికి సంతాపం


చెంద్రాయుడు (ఫైల్)

కడప రూరల్: జిల్లా మాజీ సైనిక గృహ నిర్మాణ సంఘం మాజీ అధ్యక్షుడు చెంద్రాయుడు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి జిల్లా మాజీ సైనిక గృహ నిర్మాణ సంఘం అధ్యక్షుడు జెడ్ ఫిలిప్స్ సంతాపం వ్యక్తం చేశారు. చెంద్రాయుడు సైనికునిగా దేశానికి అమూల్యమైన సేవలు అందించారన్నారు. కడప నగరంలోని మాజీ సైనికుల గృహ నిర్మాణ సంఘం కార్యాలయంలో ఉదయం 9.00 గంటలకు ఆయన పార్థివ దేహానికి శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా క్యాండిల్ నైట్ సర్వీస్


క్యాండిల్ నైట్ సర్వీసులో పాల్గొన్న విశ్వాసులు

కడప రూరల్: కడప నగరంలోని కాంగ్రిగేషనల్ టౌన్ చర్చిలో ఆదివారం రాత్రి క్యాండిల్ నైట్ సర్వీస్ నిర్వహించారు. పాస్టర్ రెవరెండ్ మోహన్‌బాబు మాట్లాడుతూ యేసు క్రీస్తు విశ్వానికి వెలుగై ఉన్నాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలతో కలిసి మెలిసి ఉండాలన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి చైర్మన్ సంజీవ రాయుడు, విజయుడు, నోవా బెన్నీ, రాజా మనోహర్, ఆశీర్వాదమ్మ, ప్రసన్న, సుశీలమ్మ పాల్గొన్నారు.

క్రైస్తవులకు ప్రత్యేకం.. శాంతి మందిరం

క్రిస్మస్ పండగ సందర్భంగా జిల్లాలో చర్చిలన్నీ కొత్త కాంతులతో కళకళలాడుతున్నాయి. క్రైస్తవులకు ప్రత్యేకత గల ఈ చర్చిలు చాలా సంవత్సరాలుగా తమ విశిష్టత చాటుతున్నాయి. కడప నగరంలో అద్భుత నిర్మాణ చతురతకు ప్రతిరూపంగా నిలిచి ప్రభువు ప్రేమను పంచే శాంతి మందిరాలుగా విశ్వాసులతో కళకళలాడుతున్నాయి. వాటి గురించి క్లుప్తంగా....


ఆరోగ్యమాత చర్చి


మరియాపురంలోని చర్చి

కడప కల్చరల్ : మరియాపురంలోని విశాలమైన మైదానంలో ప్రశాంతమైన వాతావరణంలో క్యాథడ్రల్ చర్చి నిర్మించారు. రాయలసీమలోనే విశిష్ట మైనదిగా పేరుగాంచిన ఈ చర్చి విభిన్న మతాల సామరస్యానికి ప్రతీకగా నిలిచిది. అద్భుత మైన సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనంగా, అద్భుత మైన శిల్ప సౌందర్యం కలిసిన ఈ చర్చిని జిల్లాలో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా నిర్మించారు. మరియాపురం తొలి బిషప్ అరుళయ్య ఆశలు. ఆయన ఆశయాలకు అనుగుణంగా 1988లో ఫిబ్రవరి, 11న ఈ చర్చి నిర్మాణం ప్రారంభమై 1992 ఫిబ్రవరి, 11న పూర్తయింది. కోటి రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ చర్చిలో ఇటలీ నుంచి తెప్పించిన మరియమాత విగ్రహాన్ని , 400 కిలోల చర్చి గంట ఏర్పాటుచేశారు. ఒకేసారి 200 మంది ప్రార్థనలు చేసుకోగల విశాలమైన హాలు చర్చికి ప్రధాన ఆకర్షణగా ఉంది. పైన అమర్చిన తామరపువ్వు ఆకారం జాతీయ భావాన్ని చాటుతోంది. హిందూ, ముస్లిం, బౌద్ధ వాస్తు రీతుల అనుగుణంగా స్తంభాలపై శిల్పకళ కనిపిస్తోంది.

ఆరోగ్యమాత చర్చి

ఈ చర్చిని బ్రిటీష్ పాలనలోనే నిర్మించారు. అప్పట్లో బళ్లారి నుంచి క్రైస్తవ మత ప్రచారకుడు జిల్లాకు వచ్చి సువార్తను ప్రజలకు అందజేసేవారు. ఈ క్రమంలో కొందరు మత గురువులు రైల్వే స్టేషన్‌కు సమీపంలో ప్రస్తుతం ఆరోగ్యమాత చర్చి ఉన్న ప్రాంతంలో కొట్టాలు నిర్మించుకుని ప్రచారానికి వచ్చినపుడు అందులో విడిది చేస్తూ ఉండేవారు. స్థానిక ప్రజలతో ప్రార్థన చేయించేందుకు విశాలమైన పాకలను, ఆ తర్వాత చిన్న మందిరాన్ని నిర్మించుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రాంగణంలో పెద్ద చర్చి వెలిసింది. దానికి అనుబంధంగా మరియాపురం ప్రాంతంలో చర్చిని నిర్మించారు. ఆరోగ్యమాత చర్చికి వచ్చే విశ్వాసుల సంఖ్య బాగా పెరగడంతో ఇటీవల ఆ ప్రాంగణంలో మరో పెద్ద చర్చి నిర్మించారు. అర్ధ చంద్రాకారంలో రెండు అంతస్థులుగా రూపుదిద్దుకున్న ఈ చర్చిలో ఒక్కొక్క అంతస్తులో 1200 మంది చొప్పున ఒకేసారి ప్రార్థనలు చేసుకునే వీలుంది. చర్చిల నిర్మాణంలో సిద్ధహస్తులైన కడపకు చెందిన ప్రముఖ ఇంజినీరు వెంకటేశ్వర్లు ఈ చర్చిని డిజైన్ చేశారు. చర్చి ఎదుట ప్రాంగణంలో వేలాది భక్తులు సామూహిక ప్రార్థనలు చేసుకునే వీలుంది.

నేడు కలెక్టరేట్ ఎదుట బీసీల ధర్నా


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: బీసీల కుల గణన చేపట్టాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు తెలిపారు. సంస్థ కార్యాలయంలో సభ్యులతో కలిసి ఆదివారం ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ హాస్టల్ మెస్ ఫీజులు వెంటనే చెల్లించాలని, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని కోరారు. బీసీ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

కడప కల్చరల్: మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవీ రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డితో కలిసి శివాలయాన్ని ఆదివారం ఆమె దర్శించుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, జిల్లా దేవదాయశాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్‌లతో నూతన ఆలయ భవన నిర్మాణాల గురించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవదాయశాఖ అధికారితో చర్చించి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని సూచించారు. త్వరగా నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, దేవాదాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్‌లో ఉద్యోగుల చేరిక

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఏపీఎస్ఆర్టీసీకి చెందిన ఉద్యోగులు ఆదివారం కార్మిక పరిషత్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్మిక పరిషత్ జిల్లా కార్యదర్శి పురుషోత్తం, జోనల్ చైర్మన్ పీవీఎ.నారాయణ మాట్లాడుతూ పలు యూనియన్ల విధానాలు నచ్చక కార్మిక పరిషత్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారని వారు తెలిపారు. అనంతరం కార్మిక పరిషత్‌లో చేరిన నరసయ్య, నాయక్, శ్రీధర్ లక్ష్మయ్య, చంద్రశేఖర్, సునీల్ విక్టర్, ఓబయ్య, జమాలుద్దీన్, యేసోబు, శంకర్, మోహన్, మురళి, బాబులను ఆయా నేతలు అభినందించారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ డిపో అధ్యక్షుడు ఆకుల కిశోర్‌బాబు, డిపో కార్యదర్శి రాజేంద్రారెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి ఖాజాపీర్, ట్రెజరర్ శాంతప్ప పాల్గొన్నారు.

జీవిత సాఫల్య పురస్కారంతో సాహితీ గౌరవం


ఆచార్య కేతు పురస్కారాన్ని సన్నపురెడ్డికి అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: ప్రముఖ కథా రచయిత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట ఇచ్చిన జీవిత సాఫల్య పురస్కారంతో స్వీకర్త సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి విలువైన సాహితీ గౌరవం లభించిందని సాహిత్య విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు. విద్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డికి ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి జీవిత సాఫల్య స్మారక పురస్కారాన్ని ముఖ్య అతిథులు దుర్గాకుమారి, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అందజేశారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ కేతు, సన్నపురెడ్డిల మధ్య ఒక తరం అంతరమున్నా దానిని దాటుతూ సగటు వ్యక్తుల జీవితాలపై కథల నిర్మాణం చేసిన ఘనత ఇద్దరికీ దక్కుతుందని పేర్కొన్నారు. ప్రపంచాన్ని ప్రేమించాలంటే కుల, మత అహంకారాలను వదులుకోవాలని, సన్నపురెడ్డి కథలు అదే చెప్పాయన్నారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడు మాట్లాడుతూ తనకు అలపర్తి పిచ్చయ్య చౌదరితో తనతోగల అనుబంధాన్ని తెలిపారు. అలపర్తి పిచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తన సాహితీ జీవన యానం గురించి వివరిస్తూ తనకు ఈ పరంగా ఆచార్యకేతు ఎంతో స్ఫూర్తినిచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కథా రచయిత శశికళ, మూల మల్లికార్జునరెడ్డి, బొల్లు కృష్ణమూర్తి, శశికాంత్, విశ్వప్రసాద్, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

మానవత్వం చూపడమే క్రిస్మస్ సందేశం

వైస్ ఛాన్సలర్ ఆచార్య విశ్వనాథకుమార్


క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న అతిథులు

కడప కల్చరల్: మనుషుల్లో మానవత్వం వెల్లివిరిసినప్పుడే సమాజం సుఖశాంతులతో ఉంటుంది.. క్రిస్మస్ పండుగ ఈ సందేశాన్నే అందిస్తోందని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య విశ్వనాథకుమార్ అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ(ఇంటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంస్థల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాష్ నగర్‌లోని జీసస్ బ్లెస్సింగ్స్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుక నిర్వహించారు. మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాటి మనుషుల పట్ల ప్రేమ, దయ, క్షమాగుణం కలిగి ఉండాలని దైవ గ్రంథాలు ఉద్బోధిస్తున్నాయన్నారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ అన్ని మతాల సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడమే తమ ధ్యేయమన్నారు. లయన్ మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ ఏ మతం అయినా విశ్వ శాంతినే కోరుతుందన్నారు. అనంతరం పాస్టర్ విజయ్ కిషోర్ పర్యవేక్షణలో కేక్ కట్ చేసి మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిథులను, దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతబొట్ల వెంకట సుబ్బయ్య,ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, రంగనాథరెడ్డి, ఇలియాస్‌రెడ్డి, రాజశేఖర్ రాహుల్, గౌరీశంకర్, పాస్టర్ విజయ్ కిషోర్, జనార్దన్‌రాజు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ తరగతులు


విద్యార్థినులతో వైవీయూ వీసీ, ప్రిన్సిపల్

వైవీయూ: ఆత్మస్థైర్యం గల యువత తయారుకావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహ విద్యార్థినులకు వారం రోజులపాటు ఇచ్చిన తైక్వాండో శిక్షణ ఆదివారం ముగిసింది. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో నైపుణ్యతను అవసరమైన సందర్భంలో ధైర్యంగా ఉపయోగించుకోవాలన్నారు. పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడుతూ ధైర్యవంతులైన అమ్మాయిలు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని ముందుకెళ్లగలుగుతున్నారని పలువురి గురించి ఉదహరించారు. తైక్వాండో నిపుణులు నాగూర్‌బాబు మాట్లాడుతూ చేసే పనిని ఒక యజ్ఞంలా భావించాలని, శ్రద్ధ, ఓర్పు, సహనం జీవితంలో భాగం కావాలన్నారు. అనంతరం శిక్షణా నిపుణులు నాగూర్ బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓపెన్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న జయవర్ధన్

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లాలో ఓపెన్ పాఠశాల తరగతులు నిర్వహించకపోయినా, ఫీజులు వసూలు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ ఆరోపించారు. కడప కాగితాలపెంటలోని ఏఐఎస్‌బీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 7 వేల మందికి పైగా ఓపెన్ విద్యకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల తరగతులు నిర్వహించకుండా, పరీక్షల సమయంలో మాత్రమే హాల్‌టికెట్ జారీ చేసి అభ్యర్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారని వాపోయారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, కడప, మైదుకూరు ప్రాంతాల్లో ఓపెన్ విద్యను ఒక వ్యాపారంగా మలుచుకొని లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల పరీక్ష సమయంలో విద్యార్థులను పాస్ చేయిస్తామని చెప్పి అదనపు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సగిలి రాజేంద్ర ప్రసాద్, పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌లను ఏర్పాటుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీవీ.ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్కూల్ కం ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌లు ఏర్పాటుచేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప ఎన్జీవో భవనంలో ఏపీటీఎఫ్ అమరావతి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. సీవీ.ప్రసాద్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జూనియర్ కాలేజీకి లింక్ అప్ చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ల్యాబ్, ఆటస్థలం, ఇతర సౌకర్యాలు ఉన్న చోటే స్కూల్ కాంప్లెక్సుల్లో ఏర్పాటుచేయాలని కోరారు. విద్యాశాఖ ప్రకటించిన ఏ,బి స్కూల్ కాంప్లెక్స్‌ల మధ్య గల తేడాలు వివరించి, అభ్యంతరాల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కడప జిల్లా ప్రధాన కార్యదర్శి అలీఖాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కాంప్లెక్స్‌లను కొనసాగించాలని, కాంప్లెక్స్‌ల మధ్య దూరం కనీసం ఐదు కిలోమీటర్లు ఉండేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఉమాకాంత్, చంద్ర, పద్మజ పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌ను జూనియర్ కళాశాలలుగా మార్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు


కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హైస్కూల్ ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలలుగా మార్చాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, సుబ్బరాజు యాదవ్ డిమాండ్ చేశారు. కడప ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను కాపాడతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం తక్షణమే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పీఆర్సీ అమలు చేయాలని, అంత వరకు 35 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయుడు అదే కేడర్‌లో రిటైర్డ్ అవడం బాధాకరమన్నారు. డిప్యూటీ ఈఓ, జేఎల్, ప్రిన్సిపల్ పోస్టుల్లో బోధన చేసేవారికి మాత్రమే ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీఎఫ్ డిమాండ్ చేస్తుంది. ఈ సమావేశంలో ఎస్టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, ఆవుల శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, నరేష్, అబ్దుల్‌సలాం, శ్రీరాములు, ఆలమూరు ప్రసాద్, మదన్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, జొన్నాడ శ్రీనివాసులు, కిష్టపర్ జాన్, పుల్లన్న , శివ, రవిశంకర్ పాల్గొన్నారు.

జెండా మహోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం


ఖాదర్‌వలి జెండా మహోత్సవంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కడప నాయబ్‌సాబ్ వీధిలో వెలసిన హజరత్ ఖాదర్‌వలి జెండా మహోత్సవంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉరుసులో పాల్గొన్నారు. అంజద్‌బాషాను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షఫీ, జిలాన్, అన్సర్, బీహెచ్ ఇలియాస్, గయాజ్, బాబు, అక్రమ్, అన్వర్,మహబూబ్ బాషా, ఫైరోస్, సూరజ్, ఇమ్రాన్, పాల్గొన్నారు.

పేదలకు వడ్లు వితరణ


బస్తాల్లో వడ్లు నింపుతున్న లేవాకు లక్ష్మిరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివారులోని రామచంద్రాపురంలో తాను రెండెకరాల్లో పండించిన వరి ధాన్యాన్ని లేవాకు నారపురెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి పేదలకు పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ఏటా రెండెకరాల్లో పండించిన వరిధాన్యాన్ని గింజ కూడా తీసుకోకుండా పేదలకు అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రామచంద్రాపురం, రామరాజుపల్లి, పబ్బాపురం గ్రామాల్లో పేదలకు కుటుంబానికి బస్తా చొప్పున ధాన్యాన్ని ఉచితంగా అందించామని తెలిపారు. 2007 నుంచి ఏటా నిరంతరంగా వడ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లేవాకు నితీష్‌రెడ్డి, శివ, వేమయ్య, శ్రీను, రమణ, మహేశ్వరెడ్డి పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు


అప్రోచ్ రోడ్డును పరిశీలిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: కేసీ కెనాల్ వెంబడి అయేషా స్కూల్ వెనుక నుంచి దేవుని కడప మీదుగా ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం వరకూ అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తెలిపారు. ఆదివారం ఉదయం ఆ రోడ్డును వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాన్ బాషా, దాసరి శివప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, పవర్‌అల్తాఫ్, మియ్యా, చాక్లెట్‌గౌస్, అలీ అక్బర్, షంషీర్, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో వసతి గృహ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బద్వేల్ ప్రాంతంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల పేర్లు నమోదు చేసి బోగస్ హాజరు వేసుకుంటున్నారని ఆరోపించారు. ఇన్‌ఛార్జి వసతి గృహ అధికారులు అవినీతికి పాల్పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేదని ఆరోపించారు. ఆదివారం అనధికారికంగా సెలవు తీసుకుంటున్నారన్నారు. మనోజ్, మహేష్, విగ్నేష్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న అతిథులు

కడప కల్చరల్: కడప ఆజాద్ నగర్‌లోని క్రీస్తు ప్రార్థన మందిరం అధ్యక్షుడు పాస్టర్ పి.శ్రీనివాసులు, సిస్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు పాస్టర్ పి.మహేష్, పాస్టర్ కె.ఆనంద్ మాట్లాడుతూ క్రీస్తు జననం మానవాళికి గొప్ప భాగ్యమని, యేసు క్రీస్తును ఆదర్శం చేసుకోని విశ్వాసులు శాంతియుత జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. దైవ మార్గంలో పయనించే వారు చెడు అలవాట్లకు దూరమై ఆధ్యాత్మికంగా ఎదుగుతారని తెలిపారు. ప్రతి మానవుడు ప్రభువు మార్గాన్ని అనుసరించాలని సూచించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రవితేజ, విశ్వాసులు ధనరాజు, శాంతమ్మ, హరికృష్ణ, శ్యామ్‌రాజులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వైద్య సేవలు పొందుతున్న దేవుని కడపకు చెందిన ఒంటేరు రామసుబ్బమ్మకు స్థానిక శ్రీ కృష్ణ దేవరాయ బలిజ అభ్యుదయ సేవా సమితి(బాస్) జిల్లా అధ్యక్షుడు దాసరి శివప్రసాద్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆమె స్వగృహానికి వెళ్లి రామసుబ్బమ్మను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని సుధీర్, సుమలపు సుబ్బయ్య, సంద్ర మధుసూదన్, ముని మోహన్, తదితరులు పాల్గొన్నారు.

విజయ దుర్గమ్మను దర్శించుకున్న మంత్రులు


మంత్రులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్: జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మలరామానాయుడు ఆదివారం కడప నగరంలోని విజయ దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు మల్లికార్జునరావు స్వాగతం పలికి అమ్మవారిని దర్శింప జేశారు. పూజలు నిర్వహించిన మంత్రులకు ఆలయ అర్చక బృందం వేదోక్తంగా ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పీవీరావు ఆశయాల అమలుకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: మాల ఉద్యమ నేత మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ.రావు ఆశయాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని ఆ సంఘం గౌరవ సలహాదారు అయిత బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బరపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో పీవీ.రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతున్న వారి స్వార్థ రాజకీయాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి పీవీ.రావు అని కొనియాడారు. జాతి ప్రయోజనాల కోసం ఆఖరి నిముషం వరకూ శ్రమించారని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల వసంతకుమార్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు అందజేత


దుప్పట్లు అందజేస్తున్న దాత

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలోని వివిధ ప్రాంతాల్లో పేదలు, యాచకులకు నగరానికి చెందిన శేఖర్, సుధాకర్ ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పేదలకు తన వంతుగా అండగా నిలబడాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

చీరల పంపిణీ

కమలాపురం : పేద ప్రజలు సైతం క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని స్థానిక సీఎస్ఐ చర్చి ఫాస్టర్, కమలాపురం డివిజనల్ చైర్మన్ రెవ.యు. సాల్మోన్ బాబు తెలిపారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.